# రాజీ

సోమయాజుల శ్రీనివాసరావు

విశ్రాంతిగా కుర్చీలో కూర్చుని చిక్కటి టీ రుచిగా, వేడిగా త్రాగుతున్న షణ్ముఖరావుతో భార్య అంది: "ఏమండీ, రెండేళ్ళ నుండి ఒక్క మంచి చీర కూడా కొనుక్కోలేదు. అందుబాటులోవున్న నందా, నందా యాభై రూపాయల చీరలే కొనుక్కోవలసి వచ్చింది. ఈ దీపావళికైనా ఓ మంచి చీర మూడు వందలకి తక్కువ లేని మన్నే చీర కొనుక్కుంటాను. ఇప్పుడే చెప్తున్నాను" అంది హెచ్చరిస్తున్నట్టుగా.

ఓ పక్కగా కూర్చొని చదూకుంటున్న పెద్ద వాడు రాజు "నాన్నా, నాకు రోజూ స్కూలుకి రెండు కిలోమీటర్లు నడిచి వెళ్ళటం చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఓ కొత్త సైకిలు కొనుక్కుందాం-మా క్లాసులో అందరికీ సైకి ళ్ళున్నాయి- నాకు తప్ప. ఇంకా ఎంత కాలం ఆగాలి. మూడేళ్ళ నుండి కొనిస్తానని అంటున్నావు. ఈసారి పండుగ లోపల కొని వ్వాల్సిందే" అన్నాడు ఖండితంగా. రాజు పదో తరగతి చదువుతున్నాడు. తెలివైనవాడు, చదువులో చురుకైనవాడు. పైగా బుద్ధిమంతుడు. సంతానంలో శ్రేష్ఠుడు.

రాజు పక్కనే వున్న చెల్లెలు-సుమిత్ర లెక్కలు చేసుకుంటూ అంది: "నాన్నగారూ, క్రిందటిసారి ఇన్నంటే ఇన్నే తక్కువ టపా కాయలు కొన్నారు. ఈసారి బాగా కొనాలి. ఎక్కువ రూపాయలకి. ఇన్ని- ఇన్నన్ని" అని రెండు చేతులూ వెడల్పుగా చాచి చూపింది ముద్దుగా. సుమిత్ర అంటే తండ్రికి బహు ముద్దు. ఒకే కూతురు. ముద్దు ముద్దుగా మాట్లాడుతుంది. ముద్దుల మూటలా వుంటుంది. మూడో తరగతిలో ఉంది.

ఆ పక్కనే చదువుకుంటున్న రెండో అబ్బాయి మాధవ అందుకున్నాడు "నాన్నగారూ, చెల్లెలు చెప్పింది నిజం. ఈసారి ఎక్కువ టపా సులు కొనాలి. అంతే." అన్నాడు చెల్లెలికి మద్దతు నిస్తున్నట్టు. వాడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చెల్లెలంటే చాలా ముద్దు. తండ్రికే కాక ఆ అన్న లిద్దరికీ.

"ఇంకా పండుగ చాలా దూరం వుంది చూద్దాంలేరా" అన్నాడు షణ్ముఖరావు. భార్యతో "నాకూ మీరందరూ కోరినవన్నీ-కోరకనే అమ ర్చిపెట్టాలనిపిస్తుంది- కానీ వీలు కావడంలేదు" అన్నాడు నిదానంగా. షణ్ముఖరావు కేంద్ర ప్రభుత్వ సంస్థలో అప్పర్ డివిజన్ క్లర్క్. ఉంటం నగరంలో- వచ్చే జీతం బొటాబొటిగా సరిపో తుంది. భార్య అంటే అను రాగం, పిల్లలంటే. నల్లమాలిన ఆప్యాయత ఉన్నా-ఆర్థికంగా అస హాయుడు.

పండుగ ఇంకా పది రోజులుంది.

ఆ రోజు షణ్ముఖరావు భార్యనీ, పిల్లలనీ బజారుకి తీస్కెళ్ళి- భార్యకి చక్కటి చీరెలు. ఒకటి కాదు రెండు కొని ఐదు వందలు చెల్లిం చేడు బట్టల షాపులో. పిల్లలకి కూడా బట్టలు కొన్నాడు తలా ఓ జత. రెడీమేడ్‌వి ఐదు వందల అరవై రూపాయలైంది. పెద్దవాడు- రాజుకి-ఓ కొత్త 'అట్లాస్' సైకిలు కొన్నాడు. కొడుకు మొహంలో ఆనందం- అంబరాన్ని అందుకున్నట్లుగా ఉంది. ఆ ఆనందం చూసి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. రెండో వాడికీ కూతురికీ, వాళ్ళ కోరిక ప్రకారం మరిన్ని అంటే అంతకు ముందు ఏడాదికన్నా ఓ వంద రూపా యలెక్కువగా ఖర్చుపెట్టి టపాసులు కొన్నాడు. అంతా కలిసి హోటల్‌కెళ్ళి ఇడ్లీ, దోశ, వడ ఫలహారంగా తిని కాఫీలు త్రాగి-ఇంటిదారి పట్టేరు. పండుగ ఇంకా మూడు రోజులుం దనగా "మీరు బట్టలు కొనుక్కోలేదా!"

అని అడిగింది భార్య.

ఇంకా రెండు రోజులుందనగా మళ్ళా అడి గింది "ఏమండీ ఈసారి మా అందరికీ అడిగి నవన్నీ కొనిపెట్టేరు. మీ బట్టలు-ఎప్పుడు తెచ్చు కుంటారు?" అని అడిగింది. షణ్ముఖరావు ఎప్పుడూ బట్టలు కొని టైలర్‌కిస్తాడు. అతనికి రెడీమేడ్ బట్టలంటే అయిష్టం. బట్టలు కొను క్కొచ్చి టైలర్‌కి ఇచ్చేముందు భార్యకీ, పిల్లలకీ కూడా చూపిస్తాడు. ఈసారి పండుగ రేపుం దనగా ఇంకా బట్టలు తెచ్చుకోలేదనే మాట మర్చిపోకుండా అడిగింది. రెట్టించి "రేపే పండుగ కదా? బట్టలు ఎప్పుడు కొను క్కుంటారు? ఎప్పుడు టైలర్‌కిస్తారు? కనీసం రెడీమేడ్ బట్టలైనా తెచ్చుకోండి. మీరు రోజూ ఆఫీసు కెళ్ళేవాళ్ళు కదా! పండక్కి బట్టలు కుట్టించుకోకపోతే ఎలా?" అని.

షణ్ముఖరావన్నాడు: "ఈసారి నా కొత్త బట్ట లకి టాటా. ఒక్క పండుగకు కొత్త బట్టలేక పోతే నాకేం తక్కువ కాదు. నీ సంతోషంకన్నా, పిల్లల సంబరంకన్నా-అవెక్కువ కాదు నాకు. ఈసారికాకపోతే వచ్చేసారి బట్టలు కుట్టించు కుంటాను. ఆఫీసు వాళ్ళిచ్చిన బోనస్ జీతం సగం ఇప్పటికే ఖర్చయ్యాయి. ఇంక నా బట్ట లకి అప్పు చెయ్యాలి. అది నాకిష్టం లేదు" అన్నాడు. ◆

